క్లుప్తంగా

రూ.1.88 లక్షల ఆదాయం



కొల్లాపూర్: వివిధ కేసులలో పట్టుబడ్డ 12 ద్విచక్ర వాహనాలకు బుధవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించారు. సీఐ నాగిరెడ్డి సమక్షంలో వేలంపాట కొనసాగింది. వాహనాల ధర మొత్తం రూ.1.19 లక్షలుగా అధికారులు నిర్ణయించారు. వేలానికి పోటీ ఉండడంతో ఔత్సాహికులు రూ.1.88 లక్షలకు పాట పాడి వాహనాలను దక్కించుకున్నారు. వేలం డబ్బుతో పాటు జీఎస్టీ పన్నుగా రూ.31,928 ఆదాయం లభించిందని సీఐ తెలిపారు.

విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి



పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ శివలింగం పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



తాడూరు: మండలంలోని చెర్లతిర్మలాపురంలో ఆచార్య ప్రభోదనంద యోగీశ్వరస్వామి రచించిన భగవద్గీత గ్రంథాలను ఇంటింట పంపిణీ చేశారు. ప్రభోధ సమితి జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు మనోహర్, సాయి, శంకర్ పండుగల విశిష్ట గురించి వివరించారు. సర్వమానవాళికి సమన్వయ జ్ఞానాన్ని అందించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఆంజనేయులు, రమాదేవి, స్వప్న పాల్గొన్నారు.

కేసు నమోదు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఆమనగల్లు నుంచి వెల్దండ వైపు బైక్‌పై వెళ్తున్న అఖిల్ ముందుగా వెళ్తున్న జగదీష్ స్కూటీని ఢీకొట్టాడు. బైక్ అదుపుతప్పి వెల్దండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసమైంది. స్కూటీపై వెళ్తున్న జగదీష్‌తో పాటు అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

కాన్షీరాం జయంతిని వేడుకలా నిర్వహిద్దాం



నాగర్‌కర్నూల్‌రూరల్: ఈ నెల15న కాన్షీరాం జయంతిని వేడుకలా నిర్వహిద్దామని బీఎస్పీ అసెంబ్లీ కమిటీ అధ్యక్షుడు కల్యాణ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో అసెంబ్లీ స్థాయి పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్షీరాం జయంతికి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హర్ష, నాగేష్, భాస్కర్, వెంకటయ్య, శేఖర్, వెంకటేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను మరువద్దు

నాగర్‌కర్నూల్‌రూరల్: అందరికీ సమాన హక్కుల కోసం పోరాడిన మహనీయులను మరువద్దని జిల్లా స్వేరోస్ నాయకులు దుబ్బ నాగేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో స్వేరోస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహనీయుల త్యాగాల ఫలితంగా ప్రస్తుతం సంక్షేమ ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు భీమ్‌దీక్ష పవిత్ర మాసాన్ని చేపడుతునట్లు పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలో ముగింపు సభలు నిర్వహిస్తామని వివరించారు. అనంతరం జ్ఞాన దీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. బండమీది కృష్ణ, రెడ్డపాకుల శివశంకర్, మోహన్, ధర్మరాజు, సంపత్‌కుమార్, రాము, రమేష్, రామస్వామి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం ప్రశాంతంగా కొనసాగింది. మొదటి రోజు పకడ్బందీగా నిర్వహించారు. తాడూరు మండలకేంద్రలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొత్తం 134 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 127 మంది విద్యార్థులు హాజరయ్యారు. తిమ్మాజిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 104 మంది విద్యార్థులకు గాను101, తెలకపల్లిలో బాలికల గురుకుల కళాశాలలో 253 మంది విద్యార్థులకు 242 మంది హాజరయ్యారు. కోడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 324 మందికి గాను 16మంది, వెల్దండ మోడల్‌హైస్కూల్ 162మంది విద్యార్థులకు 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 163మంది విద్యార్థులకు ముగ్గురు విద్యార్థులు హాజరుకాలేదు. కొల్లాపూర్ పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ బాలుర, బాలికల కళాశాలల్లో ఇంటర్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.



వెల్దండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థినులు



తెలకపల్లిలో..



తాడూరులో వివరాలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

25 ట్రాక్టర్ల ఇసుక సీజ్

సాక్షి ఎఫెక్ట్..

తిమ్మాజిపేట: మండలంలోని బుద్ధసముద్రం గ్రామ సమీపంలో అక్రమంగా డంప్ చేసిన 25 ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. 'యథేచ్ఛగా ఇసుక తరలింపు' అనే శీర్షికతో బుధవారం సాక్షి దినపత్రిలో వార్త ప్రచురితమైంది. దీనికి తహసీల్దార్ రామకృష్ణ, ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రలు స్పందించి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అక్రమంగా డంప్ చేసిన ఇసుకను పరిశీలించారు. ఇసుక మొత్తం 25 ట్రాక్టర్ ట్రిప్పులు ఉన్నట్లు గుర్తించారు. ఇసుకను సీజ్ చేశామని పేర్కొన్నారు. అధికారుల నుంచి ఎంలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఇసుక డంప్ వద్ద విచారణ చేస్తున్న అధికారులు

బంగారం, వెండి ఆభరణాలు చోరీ

అచ్చంపేట రూరల్: తాళం వేసిన ఇంటికి దొంగలు కన్నం వేసి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు చోరీ అయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ వివరాల ప్రకారం పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన వారుగంటి అలివేల అనారోగ్యం కారణంగా ఈనెల 1న ఇంటికి తాళం వేసి హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లింది. బుధవారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపు తాళం విరగొట్టి కన్పించడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న దుస్తులు చిందరవందరగా పడిఉన్నాయి. చోరీ అయినట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 10 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలు అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



వెల్దండ: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటునట్లు ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోతేపల్లి, అల్లంతోటబావి తండా తదితర గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలలో ఈతచెట్లు, పండ్ల మొక్కలు పెంచేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నర్సరీలల్లో మొక్కలు ఎండిపోకుండా గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా గతంలో నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. వేసవిలో కూలీలకు పనులు కల్పించాలన్నారు. ప్రతి వారం బిల్లులు అందే విధంగా మస్టర్లను ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఫీల్డ్‌అసిసెంట్లు, టీఏలు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రుణాలు ఇవ్వాలి



కందనూలు: దివ్యాంగులకు రుణాలు ఇవ్వాలని ఆ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా సభ్యుడు రాజశేఖర్ నాయక్, దేవేందర్‌చారి బుధవారం డీబ్ల్యూఓ జిల్లా సంక్షేమ అధికారి రాజేశ్వరికి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా కేంద్రంలో అధికారిని కలిసి సమస్యలను విన్నవించారు. అంగన్‌వాడీ పోస్టులలో నాలుగు శాతం దివ్యాంగ మహిళలకు కేటాయించాలన్ని కోరారు. ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం కేటాయించాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దివ్యాంగులు, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు భూమిలేని పేదలందరికీ ఉపాధి హామీ జాబ్‌కార్డ్‌తో సంబంధం లేకుండా రూ.12 వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అద్దెపాగ సుభాష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఔరాస్‌పల్లి, బొందలపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి రూ.600ల కూలి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతయ్య, మైసూర్, నాగమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్ నుంచి నగదు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం: ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు నగదు మాయం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఔరాసిపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య పాల్వంచలో పెట్రోల్ పంపులో పని చేస్తున్నాడు. అతని మిత్రులు అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 16న రూ. 1,11747 లక్షల నగదును జమ చేశారు. తిరుపతయ్య ఖాతా నుంచి అదేరోజు డబ్బులు విత్ డ్రా అయినట్లు మెస్సెజ్ వచ్చింది. దీంతో సైబర్ నేరగాళ్లు నగదు కాజేసినట్లు భావించి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



కల్వకుర్తి రూరల్: జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరకు మణికంఠ, ఉపాధ్యక్షుడు నకినమోని పెద్ద యాదవ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ముఖ్య నాయకుల సమావేశంతో పాటు విలేకరులతో మాట్లాడారు. 90% ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ఉంటే 10% ఉన్న అగ్రకులస్తులు రాజకీయ పదవులు అనుభవిస్తున్నారన్నారు. బహుజనులకు రాజకీయాల్లో సమాన న్యాయం చేయాలన్నారు. బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో రాజేందర్, రాజు, భాస్కర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టాలి

కొల్లాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో ప్రధాన మురుగు కాల్వల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని మురుగు కాల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సత్యసాయి టాకీస్ సమీపం నుంచి వరిదేల చెరువు వరకు ఉన్న ప్రధాన మురుగు కాల్వను ఆధునీకరించేందుకు శుభ్రం చేసి నాలుగు నెలలు అయినా, ఇప్పటివరకు పనులు చేపట్టలేదన్నారు. దీంతో మురుగు నిలిచిపోయి దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని వివరించారు. ఆయన వెంట సలీం, రాజు, సాయికుమార్, రాముడు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన అవసరం

కల్వకుర్తి టౌన్: విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా సెక్యూరిటీ బ్యూరో సైబర్ డీఎస్పీ గిరికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని గిరిజన బాలికల కళాశాల వసతి గృహంలో సైబర్ జాగరుకత్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గిరికుమార్

పాల బిల్లులు చెల్లించాలని ఎంపీకి వినతి

కల్వకుర్తి రూరల్: పాడి రైతులకు పాల బిల్లులు సక్రమంగా వచ్చేలా చూడాలని పాడి రైతులు బుధవారం నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవిని కలిసి వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లో ఎంపీ నివాసంలో వారు కలిసి సమస్యలను వివరించారు. గతంలో 15 రోజులకు ఒకసారి వచ్చే పాల బిల్లు రెండు నెలలు గడుస్తున్నా చెల్లించడం లేదన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో దాదాపు రూ.22 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. బిల్లులు రాక పశువులకు గడ్డి, దాణా, ఇతర సామాగ్రితో పాటు నెల వారి చెల్లించే ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. స్పందించిన ఎంపీ సమస్యను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పాడి రైతులు శేఖర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డిలు ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న రైతులు

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్

చారకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించి, అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌తో బుధవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షలో గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శుల నుంచి ఉపాధి అధికారుల నుంచి వివరాలను సేకరించారు. గ్రామాల్లో అభివృద్ధి, ఉపాధిపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి పని కల్పించాలని ఉపాధి అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులు ఉన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఉప్పునుంతల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను తప్పనిసరిగా అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎల్ దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల కమిటీ సభ్యులు, ఇతర పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 5వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజా సమస్యలపై సర్వేలు నిర్వహించి వాటి పరిష్కారం కోసం మండల కార్యాలయాల ముందు ధర్నాలు చేపడుతామన్నారు. అనంతరం స్థానిక బీసీ, ఎస్సీ కాలనీల్లో ప్రజలను కలిసి సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు, మండల కమిటీ సభ్యులు ఉస్సేన్, పానుగంటి శ్రీరాములు, సైదులు పాల్గొన్నారు.

పక్కా భవనం లేక అవస్థలు

పెద్దకొత్తపల్లి: బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాల నిర్మాణంకోసం 2016లో రూ.3 కోట్లు మంజూరయ్యాయి. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం 5 ఎకరాలు చూపకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. దీంతో ప్రస్తుతం గురుకుల పాఠశాల అద్దెభవనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న భవనం వద్ద ఆటస్థలం లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు స్థలం లేకపోవడంతో నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లి బీటీ రోడ్డును దాటివెళ్లి విద్యార్థులు ఆటలు ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రెండు సంవత్సరాల కిందట బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు చంద్రకల్ శివారులో ఉన్న సర్వే నంబర్ 84లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి అట్టి స్థలానికి కంచె ఏర్పాటు చేశారు. కాని ప్రభుత్వం ఇప్పటికీ నిధులు మంజూరు చేయలేదు.

మొత్తం 485 మంది విద్యార్థులు

పాఠశాలలో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 485 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఇంటర్ మొదటి సంత్సరం విద్యార్థులు 29 మంది ఉన్నారు. గురుకుల పాఠశాల అద్దె భవనానికి రూ.1.16 లు ప్రతి నెల అద్దె చెల్లిస్తున్నారు. కొత్తగా నిధులు మంజూరు చేసి గురుకుల హస్టల్ భవన నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బీసీ గురుకుల పాఠశాల అద్దె భవనం

ఆట స్థలం లేదు

ప్రస్తుతం ఉన్న గురుకుల పాఠశాల భవనం ముందు విద్యార్థులు ఆడుకునేందుకు ఆటస్థలం లేదు. దీంతో క్రీడలు ఆడించలేకపోతున్నాం. చంద్రకల్ వద్ద 484 సర్వే నంబర్ భూమిలో భవన నిర్మాణం చేపట్టాలి. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అక్కులు, ప్రిన్సిపాల్

భక్తిశ్రద్ధలతో విష్ణు 'సహస్ర' పారాయణం



మన్ననూర్: రాయలగండి లక్ష్మీచెన్నకేశవ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో విష్ణు సహస్ర స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు కొనసాగింది. ఆలయ ఆధ్యాత్మిక ఇన్‌చార్జ్ గెంటెల సుబ్బదాస్, ఆలయం కమిటీ అధ్యక్షుడు ఇమ్మడి నరహరి, వికాస తరంగిణి ప్రతినిధులు పాపిశెట్టి అశోక్, జయమ్మ, శ్యామల, నర్సమ్మ, పుల్లమ్మ, అలివేల, కల్ములోని పల్లి గురుస్వామి భక్తులు రఘుపతి, పరశరాములు, నిరంజన్, మార్‌కొండయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ ఎన్‌వోసీని రద్దు చేయాలి



బల్మూర్: మండలంలోని మైలారంలో మైనంగ్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గ్రామస్తులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ కేశవుకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇచ్చిన ఎన్‌వోసీని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనింగ్ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి దేవస్వామి, అనిల్‌యాదవ్, శ్రీనివాసులు, రమేష్‌గౌడ్, దశరథం భగవాన్‌రెడ్డి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులపై వివక్ష చూపొద్దు



తాడూరు: ఎయిడ్స్ రోగులపై, హెచ్‌ఐవీ సోకిన వారిపై వివక్ష చూపొద్దని ఎస్‌కేఎస్ మేనేజర్ శివకుమార్ అన్నారు. బుధవారం పీహెచ్‌సీలో సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ సంతోష్ అభిరామ్ పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఐవీ సోకిన వారిని చిన్నచూపు చూడొద్దన్నారు. అవహేళన చేయొద్దని సూచించారు. సిబ్బంది శ్రీనివాసులు, రాజేశ్వరీ, నాగమని, బాలమని, సుమతి, యాదమ్మ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్ తల్లి లక్ష్మమ్మ(72), అనారోగ్యంతో మృతిచెందింది. అదేవిధంగా అమ్రాబాద్‌కు చెందిన బురాన్(58)లు మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించి ఓదార్చి అన్నివిధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో తూడుకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ మండలంలని తూడుకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల, కోడేరులో బ్లూమింగ్ బర్డ్స్ పాఠశాల, తిమ్మాజిపేట మండలంలోని మరికల్, పోతిరెడ్డిపల్లి, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల, తాడూరు మండలంలోని పర్వతాయ్‌పల్లి, మేడిపూర్ పాఠశాలల్లో, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.



కోడేరులో..